# తబూక్ యుద్ధ నేపథ్యంలో
# హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్ర ప్రస్తావన

**హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 31.10.2025 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهُ لَا شَرِيْكَ لَهُ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهُ وَرَسُوْلُهُ۔ أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ۔
بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ ۞ اَلۡحَمۡدُ لِلّٰہِ رَبِّ الۡعٰلَمِیۡنَ ۞ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ ۞ مٰلِکِ یَوۡمِ الدِّیۡنِ ۞ اِیَّاکَ نَعۡبُدُ وَاِیَّاکَ نَسۡتَعِیۡنُ ۞ اِہۡدِنَا الصِّرَاطَ الۡمُسۡتَقِیۡمَ ۞ صِرَاطَ الَّذِیۡنَ اَنۡعَمۡتَ عَلَیۡہِمۡ ۬ۙ غَیۡرِ الۡمَغۡضُوۡبِ عَلَیۡہِمۡ وَلَا الضَّآلِّیۡنَ ۞

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయం పఠించిన అనంతరం హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు.

ఈ రోజుల్లో తబూక్ యుద్ధం గురించి ప్రస్తావన జరుగుతుంది. హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ యుద్ధం కోసం బయలు దేరినప్పుడు ఇస్లామీ సైన్యం వివిధ ప్రాంతాలలో ఆగుతూ ప్రయాణం చేసిందని, ఈ ప్రయాణంలో వరుసగా జుహ్ర్-అసర్ మరియు మగ్రిబ్-ఇషా నమాజులను కలిపి చదివారని చరిత్ర మనకు మరింత తెలియజేస్తుంది. ఈ ప్రయాణంలో హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ రజియల్లాహు అన్హు కు నమాజుకు ఇమామత్ వహించే అదృష్టం లభించింది. ఇదేవిధంగా ఈ ప్రయాణంలో మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మరియు ఇస్లామీ సైన్యం సమూద్ జాతి శిథిలాల దగ్గర నుండి కూడా వెళ్ళెను. ఈ ప్రాంతం పేరు హిజ్ర్, ఇది మదీనా నుండి తబూక్‌కు వెళ్లే దారిలో వస్తుంది. ప్రస్తుతం ఈ రోజుల్లో దీనిని మదాయెన్ సాలిహ్ అని పిలుస్తారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఈ స్థలంలోని నీటిని ఉపయోగించడం మరియు వుజూ చేయడం కూడా నిషేధించారు. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు పలికారు. మీరు ఏడుస్తూ తప్ప అన్యాయం చేసిన ఈ ప్రజల నివాసాలలోకి ప్రవేశించవద్దు. లేకుంటే వారికి సంభవించిన ఆపద మీకు కూడా సంభవించవచ్చు. ఒక ఉల్లేఖనంలో మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తన ముఖాన్ని కప్పుకొని తమ సవారీని వేగవంతం చేశారని పేర్కొనబడింది. ఇదే ప్రయాణంలో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఒంటె 'ఖస్వా' తప్పిపోయే సంఘటన కూడా జరిగింది. ఈ సందర్భంగా మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు పలికారు. అభ్యంతరం చెప్పే వ్యక్తి ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తనను తాను ప్రవక్తగా చెప్పుకుంటున్నాడు కానీ అతని తప్పిపోయిన ఒంటె ఎక్కడుందో కూడా అతనికి తెలియదని అంటున్నాడు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు పలికారు. అల్లాహ్ సాక్షిగా! నాకు అల్లాహ్ నేర్పించిన జ్ఞానం తప్ప నాకు మరొకటి తెలియదు. తర్వాత ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు తెలిపారు. అల్లాహ్ నాకు ఒంటె గురించి తెలియజేశాడు అది ఫలానా ఫలానా లోయలో ఉంది.

ఈ ప్రయాణంలో జాద్-ఎ-రాహ్ (ప్రయాణ ఆహారం) అంటే రాషన్ కూడా ముగిసిపోయింది.

మార్గమధ్యలో ప్రజలకు ఆకలి వేసినప్పుడు వారు తమ నీటిని మోసే ఒంటెలను కూడా కోయడానికి మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అనుమతి అడిగారు. దానికి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అనుమతి ఇచ్చారు. అయితే హజ్రత్ ఉమర్ రజియల్లాహు అన్హు ఇట్లు విన్నవించారు. ఈ విధంగా చేస్తే సవారీలు తగ్గిపోతాయి. మీరు ప్రజల వద్ద మిగిలి ఉన్న రాషన్‌ను తెప్పించి దానిపై బరకత్ (శుభం) కోసం ప్రార్థన చేయండి. అందుకే, అలాగే చేయబడింది. అనంతరం మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం రాషన్‌పై బరకత్ కోసం దుఆ చేశారు, ఫలితంగా రాషన్‌లో చాలా బరకత్ కలిగింది, దానిని అందరూ తిని తృప్తి చెందారు. అయినప్పటికీ రాషన్ ఇంకా మిగిలే ఉండెను.

ఈ ప్రయాణంలో అనేక సంఘటనలు జరిగాయి. వాటి నుండి వివిధ ఫలితాలు, మార్గదర్శక విషయాలు తెలుస్తాయి. ఉదాహరణకు ఇద్దరు వ్యక్తుల మధ్య గొడవ జరిగింది. ఒక వ్యక్తి మరొకరి చేతిని కొరికాడు మరియు రెండవ వ్యక్తి తన చేతిని లాక్కోవాలని ప్రయత్నించినప్పుడు, మొదటి వ్యక్తి పళ్ళు విరిగిపోయాయి. మొదటి వ్యక్తి తన విరిగిన పంటికి దియ్యత్ (నష్ట పరిహారం) అడిగాడు, దాన్ని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఈ విధంగా చెప్పి తిరస్కరించారు. ఆ వ్యక్తి నువ్వు అతని హస్తమును కొరికేసేందుకు దానిని నీ నోటిలో ఉంచాలా! అది ఏదో ఒక ఒంటె నోటిలో ఉన్నట్లుగా? కాబట్టి దియ్యత్‌కు అర్హులుగా నిర్ణయించే తీర్పు కూడా వాస్తవాలు, సాక్ష్యాలపై ఆధారపడి ఉంటుంది.

ఇదేవిధంగా ఈ ప్రయాణంలో ఒక ఖర్జూరపు తోట పక్కనుండి వెళ్ళినప్పుడు ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం కొంతమంది అనుచరులు రజియల్లాహు అన్హుంతో ఇలా అన్నారు. ఈ తోటలో ఎంత ఖర్జూరపు ఫలం ఉంటుందో అంచనా వేయండి? అందరూ అంచనా వేశారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కూడా అంచనా వేశారు. ఆ తోట యజమానురాలు పక్కనే నిలబడి ఉంది. ఆమెకు, పండు కోసినప్పుడు దాని బరువును గుర్తుంచుకో అని చెప్పబడింది. తిరిగి వచ్చినప్పుడు ఆ స్త్రీని తోట నుండి వచ్చిన పండు గురించి అడిగినప్పుడు మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అంచనా వేసిన ప్రకారం సరిగ్గా అదే బరువును ఆమె చెప్పింది.

మళ్ళీ ఈ ప్రయాణంలో ఒక రోజు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు ప్రవచించారు. నేటి రాత్రి చాలా తీవ్రమైన గాలి, తుఫాను వీస్తుంది. అందుకే అలాగే జరిగింది మరియు చాలా తీవ్రమైన గాలి వేగంగా వచ్చింది. ఈ ప్రయాణంలో అనేక రకాల అద్భుతాలు (మహిమలు) కూడా కనిపించాయి, వాటిలో వర్షం కురవడం, ఆహారం మరియు తినుభండారాల రాషన్‌లో పెరుగుదల, మరియు ఎండిపోయిన బావులలో నీరు నిండటం వంటి అద్భుతాలు ఉన్నాయి.

తబూక్ యుద్ధంలో కాపలా గురించి ప్రస్తావించబడింది. ప్రత్యేక రక్షణ కోసం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ అబ్బాద్ బిన్ బిషర్ రజియల్లాహు అన్హు ను నియమించారని పేర్కొనబడింది. వారు తమ సహచరులతో కలిసి సైన్యం చుట్టూ తిరిగేవారు. ఒక రోజు వారు ఇట్లు విన్నవించారు. ఓ అల్లాహ్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం! మేము రాత్రిపూట తిరుగుతున్నప్పుడు

తక్బీర్ (అల్లాహు అక్బర్) శబ్దాన్ని వింటుంటాము. మాతో పాటు వేరే ఎవరినైనా కాపలాగా మీరు నియమించారా? మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం లేదు! అని అన్నారు. నేను మీరే కాక ఇంకెవరినీ నియమించలేదు, అయితే కొంతమంది ముస్లింలు స్వచ్ఛందంగా బయలుదేరి ఉండవచ్చు. అప్పుడు హజ్రత్ సుల్తాన్ బిన్ సలామా రజియల్లాహు అన్హు లేచి నిలబడ్డారు, వారికి డ్యూటీ కేటాయించబడనప్పటికీ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పట్ల ఉన్న ప్రేమ కారణంగా స్వయంగా ఈ పని చేస్తున్నారు. వారు ఇట్లు విన్నవించారు. ఓ అల్లాహ్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం! నేను నా పది మంది అశ్వికదళ సహచరులతో బయలుదేరి ఈ డ్యూటీ చేస్తున్నాను. తద్వారా వారికి రక్షణ కల్పిస్తున్నాను. దానిపై దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం దుఆ చేస్తూ ఇట్లు పలికారు. అల్లాహ్ తఆలా, అల్లాహ్ మార్గంలో రక్షణ కల్పించే వారికి, రక్షణ కల్పించే వారిపై దయ చూపుగాక! మీరు రక్షించిన ప్రతి వ్యక్తి, జంతువుకు బదులుగా మీకు ఒక్కొక్క ఖీరాత్ లభిస్తుంది.

తబూక్ ప్రయాణంలో ప్రజల పరిస్థితి ఎట్లుండెననగా ప్రతి విడిది స్థలంలో కొందరు వ్యక్తులు వెనుకబడి పోయేవారు. అనుచరులు ఇట్లు విన్నవించేవారు. ఓ దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం! ఈ రోజు ఫలానా వ్యక్తి వెనుకబడిపోయాడు. దానికి ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు సమాధానం ఇచ్చేవారు. వదిలేయండి! అతనిలో ఏదైనా మంచి ఉంటే, అల్లాహ్ అతన్ని మీతో కలుపుతాడు, లేకుంటే, అల్లాహ్ మీకు అతని నుండి విముక్తి ప్రసాదిస్తాడు. ఇదేవిధంగా, ఒకసారి హజ్రత్ అబూ జర్ రజియల్లాహు అన్హు గారి ఒంటె పూర్తిగా మందగించింది, చివరకు అతను తన ఒంటెను వదిలివేసి, సామాను తల పై పెట్టుకొని మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వెనుక నడవడం ప్రారంభించారు. కొన్ని రోజుల తర్వాత ఒక విడిది స్థలంలో, ఒక వ్యక్తి ఒంటరిగా నడుచుకుంటూ రావడంను ప్రజలు చూశారు, అప్పుడు వారు మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు తెలియజేశారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు తెలిపారు. అయితే ఇతను అబూ జర్ అయి ఉండాలి! అతను దగ్గరికి చేరుకున్నప్పుడు ప్రజలు ఆ వ్యక్తి అబూ జర్ రజియల్లాహు అన్హు అని తెలియజేశారు. దానిపై మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు పలికారు. అల్లాహ్ అబూ జర్ పై దయ చూపుగాక! అతను ఒంటరిగా నడిచాడు, ఒంటరిగా మరణిస్తాడు మరియు ఒంటరిగా లేపబడతాడు. హజ్రత్ అబూ జర్ రజియల్లాహు అన్హు గురించి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి ఈ ఆదేశం అక్షరాలా నెరవేరింది. అందువలన హజ్రత్ ఉస్మాన్ రజియల్లాహు అన్హు ఖిలాఫత్ సమయంలో అతను తన కుటుంబంతో కలిసి మదీనాకు దూరంగా ఉన్న ఒక ప్రాంతానికి తరలివెళ్లారు. అతని మరణ సమయం దగ్గరపడినప్పుడు, అతని భార్య ఆందోళన చెందారు. దానికి బదులుగా హజ్రత్ అబూ జర్ రజియల్లాహు అన్హు ఆందోళన చెందవద్దు అని అన్నారు. మీలో ఒక వ్యక్తి ఎడారి మైదానంలో మరణిస్తాడు, అతని నమాజ్–ఎ–జనాజా (అంత్యక్రియల ప్రార్థన)లో విశ్వాసుల బృందం పాల్గొంటుంది అని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చెప్పడం నేను విన్నాను. అదే సమయంలో హజ్రత్ అబూ జర్ రజియల్లాహు అన్హు ఇట్లు అన్నారు. దైవ ప్రవక్త

సల్లల్లాహు అలైహి వసల్లం ఈ మాట చెప్పినప్పుడు, అక్కడ ఉన్న ప్రజలందరూ మరణించారు. కానీ వారిలో ఏ ఒక్కరూ ఎడారి మైదానంలో మరణించలేదు. నేనే ఆ వ్యక్తిని. కాబట్టి మీరు ఆందోళన చెందవద్దు. నేను మరణించినప్పుడు, నాకు స్నానం చేయించిన తర్వాత మదీనాకు వెళ్లే దారిలో నన్ను ఉంచండి. అందుకే, అలాగే చేయబడింది. కొద్దిసేపటికే, హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్ఊద్ రజియల్లాహు అన్హు తన సహచరులతో కలిసి ఆ దారి గుండా వెళుతున్నారు, వారు ఇరాక్ నుండి ఉమ్రా ఉద్దేశంతో వెళుతున్నారు. అది హజ్రత్ అబూ జర్ రజియల్లాహు అన్హు గారి జనాజా అని వారికి తెలిసినప్పుడు, వారు ఏడ్వడం ప్రారంభించారు. అబూ జర్ ఒంటరిగా నడుస్తాడు మరియు ఒంటరిగా మరణిస్తాడు అని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం నిజం పలికారని అన్నారు. తర్వాత వారు తమ సహచరులతో కలిసి హజ్రత్ అబూ జర్ రజియల్లాహు అన్హు జనాజా నమాజు చదివి, అతనిని అక్కడే సమాధి చేశారు.

మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తబూక్ చేరుకున్న తర్వాత అబూ ఖైసమ బయలు దేరి అక్కడికి చేరుకున్నారు. అప్పుడు వారు స.అ.స. ఇట్లనిరి. అతను అబూ ఖైస్మే అయితే ఎంత బాగుండు! అతను దగ్గరకు రాగానే, అనుచరులు ఓ అల్లాహ్ ప్రవక్తా! అల్లాహ్ సాక్షిగా, అతడు అబూ ఖైస్మా అన్సారీయే" అని చెప్పారు. ఓ అబూ ఖైస్మా! నువ్వు ఎందుకు వెనుకబడిపోయావు?" అని వారు స.అ.స. అడిగిరి. అప్పుడు ఆయన రసూలుల్లాహ్ స.అ.స.కు విషయం అంతా వివరించారు. దానికి ఆయన స.అ.స. ఆయనకు శుభం కోసం దుఆ చేశారు.

ముగింపులో హుజూర్ అన్వర్ అయ్యదహుల్లా తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు: రబ్వాలోని మస్జిద్‌పై జరిగిన దాడి సంఘటనలో గాయపడిన వారందరి కోసం ప్రార్థించండి. తీవ్రంగా గాయపడిన వారిని అల్లాహ్ తఆలా తన రక్షణలో ఉంచి, వారికి త్వరగా సంపూర్ణ ఆరోగ్యం ప్రసాదించు గాక. పాకిస్తాన్‌లో వ్యతిరేకుల ప్రతి పన్నాగాన్ని అల్లాహ్ విఫలం చేయుగాక. రబ్వాలో కూడా ఖత్మ్-ఎ-నబువ్వత్ పేరుతో వ్యతిరేకుల సభ జరుగుతుంది, మౌల్వీలు మాట్లాడాలనుకున్న ద్వేషపూరిత, దుర్భాషలు మాట్లాడుతున్నారు. అల్లాహ్ తఆలా వారి కీడు నుండి రక్షించుగాక. బంగ్లాదేశ్‌లోని అహ్మదీయుల కోసం కూడా ప్రార్థించండి. అక్కడ కూడా వ్యతిరేకుల దురుద్దేశాలు కనిపిస్తున్నాయి. అల్లాహ్ తఆలా అక్కడ కూడా ప్రతి అహ్మదీయున్ని రక్షించుగాక. మధ్యప్రాచ్యం కోసం కూడా ప్రార్థించండి. అల్లాహ్ తఆలా వారిపై దయ చూపి, అణచివేతదారుల నుండి విముక్తి ప్రసాదించుగాక. గత రెండు రోజులలో జరిగిన సంఘటనలు ఈ యుద్ధ విరమణ అనేది కేవలం పేరుకు మాత్రమే అని నిరూపించాయి. అల్లాహ్ తఆలా ఈ పీడిత ప్రజలను అణచివేత నుండి రక్షించి అణచివేతదారులను శిక్షించుగాక.

اَلْحَمْدُ لِلّٰہِ نَحْمَدُہٗ وَنَسْتَعِیْنُہٗ وَنَسْتَغْفِرُہٗ وَنُؤْمِنُ بِہٖ وَنَتَوَکَّلُ عَلَیْہِ۔ وَنَعُوْذُ بِاللّٰہِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَیِّئَاتِ
اَعْمَالِنَا۔ مَنْ یَّھْدِہِ اللّٰہُ فَلَا مُضِلَّ لَہٗ وَمَنْ یُّضْلِلْہُ فَلَا ھَادِیَ لَہٗ۔ وَنَشْھَدُ اَنْ لَّآ اِلٰہَ اِلَّا اللّٰہُ وَنَشْھَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُہٗ
وَرَسُوْلُہٗ۔ عِبَادَ اللّٰہِ رَحِمَکُمُ اللّٰہُ! اِنَّ اللّٰہَ یَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِیْتَآءِ ذِی الْقُرْبٰی وَیَنْھٰی عَنِ الْفَحْشَآءِ وَالْمُنْکَرِ
وَالْبَغْیِ۔ یَعِظُکُمْ لَعَلَّکُمْ تَذَکَّرُوْنَ۔ اُذْکُرُوا اللّٰہَ یَذْکُرْکُمْ وَادْعُوْہُ یَسْتَجِبْ لَکُمْ وَلَذِکْرُ اللّٰہِ اَکْبَرُ۔